జనాల్లోకి వెళ్లే దారేది?

తెలుగు తమ్ముళ్లకు రానున్న ఎన్నికలు తలకు మించిన భారంగా తయారయ్యాయి. పార్టీ జెండాతో ప్రజల్లోకి వెళ్లాలంటేనే హడలి పోతున్నారు. టీడీపీ పేరు చెబితేనే ప్రజలు ఇప్పటికీ ఛీదరించుకుంటున్న పరిస్థితిని ఆ పార్టీ నేతలు చవిచూస్తున్నారు. పథకాల పేరుతో ఆ పార్టీ సాగించిన చీకటి పాలన గుర్తొస్తున్న తరుణంలో ప్రచారానికి వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారు. మొక్కుబడిగా ఎన్నికల తంతు ముగిస్తే చాలన్న భావనతో పార్టీ కార్యాలయాల్లో టీ, కాఫీలు, ఉబుసుపోని కబుర్లకే పరిమితమవుతున్నారు.

- టీడీపీ అరాచక పాలనను ఇంకా మర్చిపోని ప్రజలు
- రైతు, డ్వాక్రా రుణమాఫీల పేరుతో మోసం చేసిన టీడీపీ
- గ్రామాల్లో నివురుగప్పిన నిప్పులా వ్యతిరేకత
- ఉత్తుత్తి చేర్పులతో పార్టీ కార్యాలయాలకే పరిమితం



కావలి: టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఏం చేసిందని చెప్పాలో అర్థం కానీ పరిస్థితిని తెలుగు తమ్ముళ్లు ఎదుర్కొంటున్నారు. టీడీపీ హయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన అరాచకాలు సునామీ జ్ఞాపకాల్లా ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. రుణమాఫీ పేరుతో రైతులను, డ్వాక్రా మహిళా సంఘాలను ఏమార్చి అధికారంలోకి వచ్చి, ఆ తర్వాత నట్టేటా ముంచిన వైనాన్ని నాలు గున్నరేళ్లు దాటిపోయినా.. జనం మర్చిపోలేక పోతున్నారు. రుణాలు చెల్లించలేక రైతులు కూలీలుగా మారితే, మహిళలు పుస్తెలు సైతం తాకట్టు పెట్టి బ్యాంకుల్లో బాకీలు చెల్లించాల్సి వచ్చింది. ఆ ఐదేళ్లలో కరువు విలయతాండవం చేయడంతో పంటలు పండలేదు. అరకొరగా పండినా.. గిట్టుబాటు ధరలు లభించలేదు. పనులు లేక బతుకు జీవనం దుర్భరంగా మారింది. మరో వైపు జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ కార్యకర్తలను రావణ సైన్యంలా జనాలపైకి వదిలారు. కలెక్టర్లు కూడా జన్మభూమి కమిటీల మాటలను కాదనలేని స్థితికి తీసుకువచ్చారు. అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తూ ఉండిపోవాల్సి వచ్చింది. రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రభుత్వం అందించే ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకువాల్సి వచ్చేది. దీన్ని ఆసరాగా చేస్తున్న జన్మభూమి కమిటీలు రాక్షసుల్లా మారి ప్రజలను పీల్చిపిప్పి చేశారు. మహిళా సంఘాలను నానా అగచాట్లకు గురి చేశారు. విలీనం పేరుతో తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను మూసేయడంతో పేద పిల్లలు బడికి దూరమయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల్లోనూ భారీగా కోతలు పెట్టారు. వరుసగా కరువు తాండవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు వలస కూలీలుగా మారారు. పాడి పరిశ్రమను కూడా దివాళా తీయించారు. మహిళా సంఘాలను అప్పుల ఊబిలో నెట్టేశారు. సామాజిక పింఛన్ల పేరుతో వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యక్ష నరకం చూపించారు. సంక్షేమ పథకాలను ఒకరిద్దరికి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆరోగ్యశ్రీని నిర్వర్యం చేసింది. అపర సంజీవని 108, 104 వాహనాల వ్యవస్థను సేవలకు దూరం చేసింది. విలీనం పేరుతో పాఠశాలలు మూసేసి పేద పిల్లలకు చదువులు దూరం చేసింది. ఇలా చంద్రబాబు చీకటి పాలన చేసిన గాయాలు జనాలను ఇంకా బాధిస్తూనే ఉన్నాయి. ఇది ఆనాటి టీడీపీ దుర్భిక్ష పాలన.

జనంలోకి వెళ్లలేక హడావుడి..

ఇలా వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఈ పాపాలన్నీ ఇప్పుడు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ప్రచారం కోసం టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. టీడీపీ పేరు చెబితేనే ప్రజలకు చీకటి రోజులు గుర్తుకు వస్తున్నాయి. జనం ఛీకొడుతుండడంతో ప్రచారం ఊసే ఎత్తడం లేదు. ఎన్టీఆర్ కాలం నుంచి పార్టీపై ఉన్న అభిమానం చంపుకోలేక మొక్కుబడిగా పార్టీ కార్యాలయాలకు వచ్చి కూర్చోవడం తప్ప. గ్రామాల్లోకి వెళ్లి ఓట్లు అడిగే సాహసం చేయలేమని ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా చెబుతుండటం గమనార్హం. ఈ పరిస్థితుల్లో తమకు ప్రజల అండ ఉందన్నట్లుగా ప్రచారం చేసుకునేందుకు టీడీపీ నేతలు హడావుడి చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే తేటపడుతున్న బతుకులు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే జనాలు కోలుకోవడం మొదలు పెట్టారు. రైతులు, మహిళా సంఘాలు మళ్లీ గాడిన పడగా, ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపు దిద్దుకుంటున్నాయి. ప్రతి నెలా 1వ తేదీనే రూ.3 వేల పింఛన్ ఇంటి వద్దనే అందిస్తుండడంతో ఏ ఆసరా లేని అవ్వాతాతలు మూడు పూటలా కడుపు నిండా తినగలుగుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలతో గ్రామాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తుండటంతో ఆరోగ్యంపై బెంగకూడా తొలగిపోయింది. మరో వైపు సచివాలయాలు, ఆర్బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌తో ఊరు గడప దాటకుండానే వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. రైతు రుణమాఫీ, పంటల బీమా, రైతు భరోసా కేంద్రాలు, రాయితీపై విత్తనాలు, గ్రామాల్లోనే నాణ్యమైన ఎరువులు అందుబాటులోకి తీసుకురావడంతో రైతుకు వ్యవసాయంపై భరోసా ఏర్పడింది. మహిళా సంఘాల రుణ మాఫీతో పాటు బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పొదుపు సంఘాలకు తిరిగి రుణ పరపతి లభించింది. మహిళలు స్వయం ఉపాధితో సాధికారత దిశగా అడుగులు వేశారు. ప్రభుత్వ పాఠశాలలను 'నాడు–నేడు'తో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేయడంతో పాటు పిల్లలను బడికి పంపిస్తే 'అమ్మ ఒడి' పేరుతో ప్రతి ఏటా తల్లి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయడంతో పిల్లలను సంతోషంగా బడికి పంపిస్తున్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు అన్ని వసతులతో కూడిన లేఅవుట్లలో స్థలాలు పంపిణీ చేయడంతో పేదలకు సొంత గూడు లభించింది. విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్ మెంట్‌తో పాటు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, తదితర పథకాలతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఇలా సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్ద దిక్కుగా నిలిచారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి ప్రజలే ప్రచారకులుగా మారి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

రుణమాఫీ పేరుతో చంద్రబాబు మోసం



చంద్రబాబు ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశాడు. రూ.1.50 లక్షలు ఒకేసారి మాఫీ చేస్తామని ప్రకటించి మాఫీ చేయకపోవడంతో బయట అప్పులు చేసి బ్యాంకు రుణాలు చెల్లించాల్సి వచ్చింది. చంద్రబాబుని నమ్ముకుంటే అంతే సంగతులని అప్పుడే అర్థమైంది.

– ఎస్‌డీ షబ్బీర్, పల్లిపాళెం, అల్లూరు మండలం

పొదుపు రుణాలు మాఫీ చేస్తామని నట్టేట ముంచాడు



ఎన్నికలకు ముందు పొదుపు రుణాలు మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చాడు. గెలిచిన తర్వాత రుణాల మాఫీ ఊసే లేకపోవడంతో బ్యాంకర్లు తీవ్ర ఇబ్బందులు పెట్టారు. రూ.20 వేల రుణం చెల్లించేందుకు నానా తిప్పలు పడ్డాం. అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి కట్టాం.

– చౌటూరు సులోచనమ్మ, డ్వాక్రా సభ్యురాలు, అల్లూరు

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే విజయీభవ యాత్ర

చేజర్ల: మండలంలోని మాముడూరులో మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్ర నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. మాముడూరు సచివాలయ పరిధిలోని నడిగడ్డ అగ్రహారం, మాముడూరు గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహిస్తారని, ఆయా గ్రామాలోల పూర్తయిన అభివృద్ధి కార్యక్రమా లు ప్రారంభిస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని కోరారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

మర్రిపాడు: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని, ఆరోగ్యశ్రీ సేవల కిందకు రాని శారీరక రుగ్మతులకు ఈ పథకం ఆపన్నహస్తంలా నిలుస్తుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో మర్రిపాడు మండలం సింగనపల్లికి చెందిన అనుమాలగుత్తి వెంకటయ్యకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు కాశీరెడ్డి, రేవూరు వేణుగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

భారతీయ ప్రమాణాలతో అభివృద్ధి పనులు



శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

ఆత్మకూరురూరల్: గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులను స్థానిక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులను, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని వక్తలు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయిలో నిర్వహించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణా తరగతుల్లో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏపీఎస్ఐఆర్‌డీ జిల్లా పరిశీలకులు రాజ్యలక్ష్మి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల స్థాయిలో అమలు చేయాల్సిన పథకాలు, నాణ్యతా ప్రమాణాలను వివరించారు. మాస్టర్ ట్రైనర్ అరుణ్, ఏవై శివ, రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేసే పనులను నాణ్యతలో తేడా లేకుండా నిర్వహించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ రమణయ్య, ఎంపీడీఓ బాలాజీనాయక్, ఈఓఆర్‌డీ ఉషారాణి, ఏఓ శ్రీనివాసరావు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం, చేజర్ల, సంగం, కలిగిరి మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న ఆశయం అందరి కర్తవ్యం

ఆత్మకూరురూరల్: నవరత్నాల పథకాల పేరుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన సమయం వచ్చిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని మురగళ్ల, అప్పారావుపాళెం, బోయలచిరివెళ్ల, తదితర గ్రామాల్లో సోమవారం జగనన్న ఆశయం, విక్రమన్న సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిని వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించి ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే రోజుల్లో ఆయా గ్రామాల్లో పరిష్కరించనున్న కార్యక్రమాలు ప్రజలకు అనువుగా చేపట్టనున్న పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు తోడేటి అశోక్, చంద్రా హజరత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి: పండ్లతోటలు సాగు చేసిన రైతులు పంటకు తెగుళ్లు సోకకుండా అధికారుల సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన శాఖ అధికారిణి జయశ్రీ సూచించారు. ఆమె సోమవారం ఉదయగిరి సమీపంలో సాగుచేసిన బత్తాయి పంటను పరిశీలించారు. పంటకు బంక తెగులు ఉన్నట్లు గుర్తించారు. బ్లేటాక్స్ మందును చెట్టు మొదలుకు పూయడం ద్వారా నివారించుకోవచ్చని రైతులకు సూచించారు. ప్రధానంగా వేరు తెగులు కూడా సోకుతుందన్నారు. తన పరిధిలో సుమారు 1,500 ఎకరాల్లో బత్తాయి సాగులో ఉందన్నారు.

యాజమాన్య పద్ధతులతో నువ్వులో అధిక దిగుబడులు

దుత్తలూరు: యాజమాన్య పద్ధతులు పాటిస్తే నువ్వు పంటలో అధిక దిగుబడులు పొందవచ్చని ఆత్మ పీడీ దొరసాని తెలిపారు. ఆమె సోమవారం మండలంలోని సోమలరేగడలోని పెద్దిరెడ్డి వెంకట్రామిరెడ్డి సాగుచేస్తున్న వైఎల్ఎం–66 రకం నువ్వు పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తక్కువ కాలంలోనే ఈ పంట ఏపుగా పెరిగి ఏడెనిమిది కొమ్మలు పెట్టటమే కాకుండా 300 వరకు కాయలు పుట్టించామన్నారు. సాధారణ రకమైన గౌరిమాధవి అనే రకంతో పోల్చినప్పుడు వైఎల్ఎం–66 రకం అధిక దిగుబడి వస్తుందన్నారు. డీపీఓ శివన్నారాయణ, ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ ఎం.వెంకటసుబ్బారెడ్డి, ఏఈఓ సుధీర్‌కుమార్, వీఏఏలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీకి కాపులు వెన్నుదన్ను

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న కాపు సంఘాల నాయకులు

కావలి: నియోజకవర్గంలో తనకు రాజకీయంగా, సామాజికంగా వెన్నుదన్నుగా కాపు సామాజిక వర్గీయులు వెన్నుదన్నుగా నిలిచారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం రాత్రి కాపులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పట్టణంతో పాటు నియోజవకర్గంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన కాపు సంఘీయులతో సమావేశమై తనకు మద్దతుగా నిలిచినందుకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజారాజ్యం ద్వారా తాను రాజకీయాల్లోకి ప్రవేశించిన రోజు నుంచి కాపులు తనకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆ తర్వాత తాను వైఎస్సార్ సీపీలో చేరినా కాపుల ఆదరణ తగ్గలేదని, ప్రతి సందర్భంలో తనకు అండగా నిలిచి అభిమానం చాటుకున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా కాపులకు సముచిత స్థానం లభించిందని చెప్పారు. గత ప్రభుత్వాలు కాపులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం కాపు నేస్తం పేరుతో కాపులకు అండగా నిలిచారని వివరించారు. కావలికి చెందిన కాపు నాయకుడు దామిశెట్టి సుధీర్‌నాయుడుకు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిని కేటాయించనున్నట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లోనే ప్రకటించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కావలిలో తనకు, వైఎస్సార్‌సీపీకి కాపుల నుంచి వస్తున్న మద్దతు తట్టుకోలేక టీడీపీ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని తరిమికొట్టేందుకు కాపులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాపు నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడండి



మహాశివరాత్రి కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అన్నదానానికి రూ.2 లక్షలు విరాళం

మర్రిపాడు: ఆత్మకూరు పట్టణంలోని తిరునాళ్లతిప్ప వద్దనున్న దుర్గా మల్లేశ్వరస్వామి (కాశీనాయన ఆశ్రమం) దేవస్థానంలో ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్న మహాశివరాత్రి కల్యాణ మహోత్సవానికి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశముందని, భక్తులకు ఎలాంటి లోటు లేకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. సోమవారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ ఉదయం 5 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గణపతి పూజ కార్యక్రమాలతో మొదలవుతాయని, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజలు, తెల్లవారు జామున 2 గంటలకు శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రూ.2 లక్షలు అందజేశారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానానికి వేలాది మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మున్సిపల్, పోలీస్, ఇతర శాఖల అధికారులు సహాయ సహకారాలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

సంక్షేమాభివృద్ధే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేకపాటి

అనుమసముద్రంపేట: సంక్షేమం..అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. సోమవారం మండలంలోని తాతిరెడ్డిపల్లి, పుట్టువారిపల్లి, రాజవోలు గ్రామాల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజయీభవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. తొలుత స్థానికంగా ఉండే దేవాలయాలు, దర్గాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. రాజవోలు పంచాయతీలో ఐదేళ్ల పాలనలో రూ.9.14 కోట్లు సంక్షేమ నిధులు అందజేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులకు రూ.14 లక్షలు, జగనన్న లే అవుట్ల ద్వారా రూ.43.20 లక్షలు అందజేసినట్లు వివరించారు. ముఖ్యంగా జగనన్న రెవెన్యూ వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా రాజవోలు పంచాయతీ పరిధిలో 99 మంది రైతుల సమస్యలు పరిష్కరించగలిగామన్నారు. ఇందులో అత్యధికంగా 62 ఎకరాల్లో చుక్కలు, నోషనల్ ఖాతాల సమస్యలు పరిష్కారం కావడంతో 225.75 ఎకరాలకు సంబంధించి భూ సమస్యలు పరిష్కారమైనట్లు వివరించారు. వైఎస్సార్ జలకళ పథకం ద్వారా 14 బోర్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు కోరిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, శ్మశానానికి దారి ఏర్పాటు అని పనులు పూర్తి చేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 వేలు సాయం

విజయీభవ యాత్రలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకపాటికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఇటీవల భర్తను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వల్లెపు రాధమ్మ కుటుంబ పరిస్థితిని వివరించారు. ఎమ్మెల్యే స్వయంగా రాధమ్మ నివాసానికి వెళ్లి ఆమె భర్త రవీంద్ర మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలుసుకుని తమ సొంత నిధులు రూ.50 వేలు అందజేసి పిల్లలను బాగా చదివించాలని, తామంతా అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వ తరఫున సాయం అందేలా కృషి చేస్తామన్నారు.

జగనన్న సంక్షేమాన్ని గుర్తు చేయండి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలకు అందజేసిన సంక్షేమాన్ని, గ్రామాల్లో చేసిన అభివృద్ధిని నాయకులు, కార్యకర్తలు మళ్లీమళ్లీ ప్రజలకు తెలియజేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో అనంతసాగరం మండలం శంకరనగరం, దేవరాయపల్లి బిట్–1 గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆత్మీయ అల్పాహార విందు నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మనం గ్రామాల్లో చేయబో అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, సీహెచ్ కృష్ణారెడ్డి, పీ సుబ్బారెడ్డి, సీహెచ్ భాస్కర్‌రెడ్డి, ఖాజామొద్దీన్, యస్థాని, సుధాకర్‌రెడ్డి, షబ్బీర్, మస్తానయ్య తదితరులు ఉన్నారు.

వలంటీర్ల సేవలకు వందనం

కావలి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం అల్లూరు మండల వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లు చేస్తున్న కృషి, అందిస్తున్న సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించడంతో పాటు లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ పథకాలు పొందేలా సహకారం అందించడంలో వలంటీర్ల సేవలు ప్రజల మనస్సుల్లో నిలిచి పోయాయన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో ప్రజలకు సేవలందించాలని సూచించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో అల్లూరు మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సహా పలువురి చేరిక
- పట్టణంలో భారీ ర్యాలీ



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

కావలి: పట్టణానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, నాయకులు షబ్బీర్, జనసేన నేత శివారెడ్డి ఆధ్వర్యంలో యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. తొలుత పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రభావితమై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గతంలో మాదిరిగానే జిల్లాలో పదికి పది స్థానాలు సాధించడం ఖాయమన్నారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

బిట్రగుంట: బోగోలు మండలంలోని సుమారు 400 మంది పదో తరగతి విద్యార్థులకు నెల్లూరుకు చెందిన గీతామయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేశారు. సరస్వతి నమస్తుభ్యం మండల కమిటీ చైర్మన్ మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో పాతబిట్రగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తమ్మినేని పాండు సహకారంతో ఎంఈఓ జయమ్మ అట్టలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,200 మందికి పరీక్ష అట్టలు పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

7న మెగా జాబ్‌మేళా

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వెంకటరమణా రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పలు ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారులు విజయ్, వినీల్ నేతృత్వంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. 10, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ చేయించుకుని ఈ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు రెజ్యూమ్‌ను తీసుకురావాలన్నారు. వివరాలకు 91827 99405, 79016 20305 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

